సాక్షి ఖమ్మం

శనివారం, 1, మార్చి, 2025



రిటైర్డ్ హెచ్‌ఎం ఇంట్లో చోరీ

తాళం వేసిన ఇంట్లో చొరబడిన దుండగుడు లాకర్ ఎత్తుకెళ్లి అందులో నుంచి రూ.25లక్షల విలువైన సొత్తు చోరీ చేశాడు. 8లో



జాగా కొలిచేదెట్లా?

ల్యాండ్ రికార్డ్స్ అండ్ సర్వే విభాగంలో సిబ్బంది కొరతతో భూముల సర్వే కోసం అందిన దరఖాస్తులు పేరుకుపోతున్నాయి. 8లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం 36° / 20°

జిల్లాలో శనివారం ఉదయం, రాత్రి చలి ప్రభావం ఉంటుంది. మధ్యాహ్నం మాత్రం సాధారణానికి మించి ఉష్ణోగ్రత నమోదవుతుంది.

న్యూస్‌రీల్

టెన్నిస్ టోర్నీ సింగిల్స్ విజేత అధర్వశర్మ



ప్రథమ, ద్వితీయస్థానాల్లో నిలిచిన శర్మ (ఎడమ), జయప్రకాష్

ఖమ్మం స్పోర్ట్స్: ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో వారం రోజులుగా కొనసాగుతున్న టెన్నిస్ టోర్నీలో సింగిల్స్ విజేతగా అధర్వశర్మ(మహారాష్ట్ర) నిలిచాడు. చల్లపల్లి రాధమ్మ స్మారక టోర్నీలో భాగంగా సింగిల్స్ విభాగంలో శుక్రవారం ఫైనల్స్ నిర్వహించారు. ఇందులో అధర్వశర్మ, ఓగెస్ థేయ్జొ జయప్రకాశ్(తమిళనాడు) తలపడగా 1–6, 6–3, 6–3 తేడాతో శర్మ టైటిల్ కైవసం చేసుకున్నాడు. ఈమేరకు విజేతతో పాటు రన్నరప్‌కు వీవీసీ గ్రూప్ చైర్మన్ వీ.వీ.రాజేంద్రప్రసాద్, డీవైఎస్ఓ టి.సునీల్‌కుమార్‌రెడ్డితో పాటు చల్లపల్లి శ్రీనివాసరావు, డాక్టర్ కాసాని అనిల్, కాంపాటి సత్యనారాయణ, మద్దినేని వెంకట్ ట్రోఫీలు అందజేశారు. అలాగే, మొదటి నాలుగుస్థానాల్లో నిలిచిన క్రీడాకారులు, డబుల్స్ విజేతలు, రన్నరప్‌కు కలిపి మొత్తంగా రూ.2.50లక్షల నగదు బహుమతి అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

కేఎంసీ కార్యాలయ నిర్వహణ బాధ్యత మెప్మాకు..

కాంట్రాక్టర్ నుండి టీఎల్ఎఫ్‌కు అప్పగింత

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం నిర్వహణ బాధ్యతలను మెప్మాకు అప్పగిస్తూ కమిషనర్ అభిషేక్ అగస్త్య నిర్ణయించారు. కార్యాలయ ఆవరణ, గదులు, బాత్‌రూమ్‌లను శుభ్రం చేయడం తదితర పనులను ఇప్పటి వరకు కాంట్రాక్టర్‌కు అప్పగిస్తున్నారు. అలాకాకుండా మహిళా సమాఖ్యకు అప్పగించాలని నిర్ణయించగా, శనివారం నుంచి బాధ్యతలను మెప్మా పరిధిలోని టీఎల్ఎఫ్(టౌన్ లెవల్ ఫెడరేషన్) బాధ్యులు నిర్వర్తించనున్నారు. కార్మికులను విధుల్లోకి తీసుకోవడం, వేతనాల చెల్లింపు, నిర్వహణకు అవసరమైన సామగ్రి సరఫరా టీఎల్ఎఫ్ సభ్యులే చేయాల్సి ఉంటుంది. నిర్వహణ కోసం నెలకు రూ.5 లక్షల మేర కేఎంసీ కేటాయిస్తుండగా టెండర్ ద్వారా దక్కించుకునే కాంట్రాక్టర్లు సరైన వేతనాలు ఇవ్వడం లేదని కార్మికులు కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో టీఎల్ఎఫ్‌కు బాధ్యతలు అప్పగించడంతో 25మంది కార్మికులకు రూ.15వేల చొప్పున వేతనం చెల్లించనున్నారు. కాగా, మెప్మాకు పనులు అప్పగించడంపై కొందరు ప్రజాప్రతినిధులు గుర్రుగా ఉన్నారని తెలుస్తోంది.

లోక్ అదాలత్‌ను విజయవంతం చేయండి

ఖమ్మం లీగల్: వచ్చేనెల 8వ తేదీన సత్తుపల్లి, మధిర కోర్టుల్లో జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి కే.వీ.చంద్రశేఖర్ సూచించారు. ఖమ్మంలో న్యాయ సేవా సదన్‌లో శుక్రవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజీ పడదగిన అన్ని సివిల్, క్రిమినల్ కేసులు, మోటార్ ప్రమాదాలు, చెక్ బౌన్స్, బ్యాంక్ రికవరీ కేసులు పరిష్కరించుకోవచ్చని చెప్పారు. రాజీమార్గమే రాజమార్గమని గుర్తించి కక్షిదారులు డబ్బు, సమయం ఆదా చేసుకునేలా లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలని తెలిపారు. ఈ విషయమై న్యాయవాదులు విస్తృత అవగాహన కల్పించాలని ఆయన పేర్కొన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నేరెళ్ల శ్రీనివాసరావు, న్యాయవాదులు పాల్గొన్నారు.

మాయదారి మహమ్మారి



రక్తపోటు, మధుమేహానికి తోడు ఇటీవల కేన్సర్ కేసులు జిల్లాలో పెరుగుతుండడం ఆందోళనకు గురిచేస్తోంది. వ్యాధి బారిన పడుతున్న వారిలో మహిళలే ఎక్కువగా ఉన్నారని వైద్యులు చెబుతున్నారు. కేన్సర్ సోకితే నియంత్రించడం కష్టమైన తరుణాన ముందస్తుగానే కట్టడికి కేంద్రప్రభుత్వం ఆయుష్మాన్ భారత్ పథకం ద్వారా నాన్ కమ్యూనికేబుల్ డిసీజెస్(ఎన్‌సీడీ)లో చేర్చింది. ఈమేరకు 30ఏళ్లు పైబడిన వారిలో నోటి, రొమ్ము, సర్వైకల్ కేన్సర్ సోకితే గుర్తించి ఆయుష్షు పొడిగించేలా చికిత్స అందిస్తున్నారు. ఇప్పటికే బీపీ, షుగర్ బాధితులకు నెలనెలా మందులు అందుతున్నాయి. ఇదేసమయాన కేన్సర్ బాధితుల గుర్తింపునకు ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు ఇంటింటికీ వెళ్లి అనుమానితులకు పరీక్షలు చేస్తున్నారు.

– ఖమ్మంవైద్యవిభాగం



జిల్లాలో 1,354 కేన్సర్ కేసులు

- బాధితుల్లో అత్యధికంగా మహిళలే..
- ఎన్‌సీడీ ద్వారా పరీక్షలు, చికిత్స

నిర్ధారణ కాగానే చికిత్స

ప్రభుత్వం కొన్నేళ్లుగా అసంక్రమిత వ్యాధుల గుర్తింపునకు ఎన్‌సీడీ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు వారి పరిధిలో అనుమానితులకు సమీప పీహెచ్‌సీల్లో వైద్య పరీక్షలు చేయిస్తున్నారు. అలాగే, ఆరోగ్య మహిళ కార్యక్రమం ద్వారా కేన్సర్ బాధితులను గుర్తిస్తున్నారు. ఆ తర్వాత జిల్లా కేంద్రానికి తీసుకెళ్లి పూర్తిస్థాయిలో పరీక్షల అనంతరం కేన్సర్ నిర్ధారణ అయితే చికిత్స ప్రారంభిస్తున్నారు. ఒకవేళ వ్యాధి తీవ్రస్థాయిలో ఉంటే హైదరాబాద్‌లోని ఎస్ఎంజే ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అంకాలజీ, రీజినల్ కేన్సర్ సెంటర్‌కు పంపించి వైద్యసేవలు అందిస్తున్నారు.

ఎం.వీ.పాలెం పరిధిలో 109మంది

జిల్లాలోని 26 పీహెచ్‌సీలు, నాలుగు యూపీహెచ్‌సీల పరిధిలో ఇప్పటి వరకు 1,354 మంది కేన్సర్ బాధితులను గుర్తించారు. అధికంగా ఎం.వీ. పాలెం పీహెచ్‌సీ పరిధిలో 129 కేసులను గుర్తించగా, చింతకానిలో 106, కూసుమంచిలో 90, బోదులబండలో 74, వైరాలో 70, వేంసూరు పీహెచ్‌సీ పరిధిలో 61మంది బాధితులు ఉన్నారు. వీరే కాక మిగతావన్నీ ఎన్‌సీడీ ద్వారా గుర్తించిన కేసులే కాగా, ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకున్న వారిని పరిగణనలోకి తీసుకుంటే జిల్లాలో బాధితుల సంఖ్య మరింత ఎక్కువగా ఉంటుందని చెబుతున్నారు.

పాలియేటివ్ సెంటర్ ద్వారా చికిత్స

ఖమ్మం పెద్దాస్పత్రిలోని పాలియేటివ్(ఆలన) సెంటర్‌లో కేన్సర్ బాధితులకు వైద్యసేవలందిస్తున్నారు. వీరిలో కొందరు జీవిత చివరి దశకు చేరగా మంచానికే పరిమితమవుతున్నారు. ఇలాంటి వారికి ఇక్కడ ఉపశమనం కలిగించేలా సేవలందిస్తున్నారు. పెద్దాస్పత్రిలోని ఆలన సెంటర్ ఏడు పడకల సామర్థ్యంతో ఉండగా.. ఇన్‌పేషంట్, ఔట్ పేషంట్ సేవలే కాక తీవ్రత ఆధారంగా బాధితుల ఇళ్లకు వెళ్లి కూడా చికిత్స చేస్తున్నారు. సెంటర్ సిబ్బంది వాహనంలో వెళ్లి మందులు ఇస్తారు. పరిస్థితి మరింత విషమిస్తే సెంటర్‌కు తీసుకొస్తున్నారు. 2018 సెప్టెంబర్‌లో మొదలైన ఈ సెంటర్ ద్వారా జిల్లాతో పాటు చుట్టుపక్కల జిల్లాల వారు 2,111 మందికి ఇన్‌పేషంట్, 6,154 మందికి ఔట్ పేషంట్ సేవలందించారు. అలాగే, వాహనంలో వెళ్లి ఇప్పటివరకు 18,028 మందికి పరీక్షలు చేశారు. కాగా, చివరి దశలో వ్యాధిని గుర్తించి పాలియేటివ్ సెంటర్ ద్వారా చికిత్స అందుకున్న 330 మంది మృత్యువాత పడ్డారని గణాంకాలు చెబుతున్నాయి. ఇందులో జిల్లావాసులే కాక పొరుగుల జిల్లాల వారు సైతం ఉన్నారు.

ఎందుకీ పరిస్థితి

కేన్సర్ బాధితుల సంఖ్య పెరగడానికి జీవన శైలిలో మార్పు, మారిన ఆహార అలవాట్లు, వ్యాయామం లేకపోవడం, కాలుష్యం వంటి కారణాలే కారణమని వైద్యులు చెబుతున్నారు. కుటుంబ బాధ్యతలను నిర్వర్తించే మహిళలు పలువురు ఉద్యోగాలు సైతం చేస్తున్నారు. దీంతో ఇంటాబయట ఒత్తిడితో తమ ఆరోగ్యంపై పెద్దగా శ్రద్ధ చూపడం లేదని తెలుస్తోంది. ఈక్రమంలోనే బాధితుల్లో అత్యధికంగా మహిళలు ఉన్నారని తెలుస్తోంది. అంతేకాక కేన్సర్ సోకిన విషయం గుర్తించకపోగా, ముదిరాక తర్వాత చేయించినా ఫలితం ఉండడం లేదు.

మెరుగైన సేవలు అందిస్తున్నాం



పాలియేటివ్ సెంటర్‌లోనే కాక బాధితుల ఇళ్లకు కూడా వెళ్లి వైద్య సేవలందిస్తున్నాం. అలాగే, వ్యాధి బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్నాం. కేన్సర్‌ను తొలి దశలోనే గుర్తించి చికిత్స ప్రారంభిస్తే ఫలితం ఉంటుంది. ఎవరికి అనుమానం ఉన్నా పరీక్షలు చేయించుకోవాలి.

– డాక్టర్ రామారావు, ఎన్‌సీడీ జిల్లా ప్రోగ్రాం అధికారి

ముందుగా గుర్తిస్తే బయటపడొచ్చు



కేన్సర్‌ను ముందుగా గుర్తిస్తే ముప్పు నుంచి బయటపడొచ్చు. ప్రారంభ దశలో ఉన్న వారికి ఇక్కడ, ప్రభావం ఎక్కువ ఉన్న వారిని హైదరాబాద్ ఎస్ఎంజేలో చికిత్సకు పంపిస్తున్నాం. జిల్లాలో పురుషులతో పోలిస్తే మహిళలే ఎక్కువగా వ్యాధి బారిన పడుతుండగా, బ్రెస్ట్, ఓరల్, సర్వైకల్ కేన్సర్ కేసులు ఉంటున్నాయి.

– డాక్టర్ ప్రేమలత, ఆరోగ్య మహిళ నోడల్ ఆఫీసర్

బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలి

ఇంటర్ బోర్డు డిప్యూటీ సెక్రటరీ యాదగిరి



మాట్లాడుతున్న డిప్యూటీ సెక్రటరీ యాదగిరి, పక్కన డీఐఈఓ తదితరులు

ఖమ్మం సహకారనగర్: ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు ఈనెల 5నుంచి మొదలుకానున్న నేపథ్యాన ఉద్యోగులు బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని ఇంటర్మీడియట్ బోర్డు డిప్యూటీ సెక్రటరీ సీహెచ్.యాదగిరి సూచించారు. విద్యార్థులకు ఇక్కట్లు ఎదురుకాకుండా ఏర్పాట్లు చేయించడమే కాక అవకతవకలు జరగకుండా పర్యవేక్షించాలని తెలిపారు. కలెక్టరేట్‌లోని శుక్రవారం ఆయన చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లతో సమావేశమై సూచనలు చేశారు. డీఐఈఓ రవిబాబు మాట్లాడుతూ ప్రశ్నాపత్రాలను పోలీస్ ఎస్కార్ట్‌తోనే కేంద్రాలకు తీసుకెళ్లాలని తెలిపారు. డీఈసీ సభ్యులు కె.శ్రీనివాసరావు, సింహాచలం, వీరభద్రం, హైపవర్ కమిటీ బాధ్యులు విజయకుమారి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

బాలికల కళాశాలలో...

ఖమ్మంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలను ఇంటర్మీడియట్ బోర్డు డిప్యూటీ సెక్రటరీ సీహెచ్.యాదగిరి సందర్శించారు. ఇటీవల కళాశాలలో ఓ విద్యార్థినిని అధ్యాపకుడు వేధించినట్లు ఆరోపణలువచ్చాయి. దీంతో కళాశాలకు వచ్చిన యాదగిరి ప్రిన్సిపాల్ అరుణ్‌కుమార్‌తో పాటు అధ్యాపకులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఇదిలా ఉండగా సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ భారతిరాణి సైతం కళాశాలకు వచ్చి వివరాలు సేకరించారు.

శాస్త్రవేత్తలు, రైతులకు పురస్కారాలు



వైరా: పంటల సాగు, సస్యరక్షణ చర్యలపై రైతులకు అవగాహన కల్పిస్తున్న వైరాలోని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలకు అవార్డులు దక్కాయి. జహీరాబాద్‌లోని కేవీకే, డెక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యాన శుక్రవారం నిర్వహించిన సమావేశంలో కేవీకే ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డాక్టర్ కె.రవికుమార్, శాస్త్రవేత్త పీఎస్ఎం.ఫణిశ్రీ అవార్డులు అందుకున్నారు. అలాగే, సత్తుపల్లి మండలానికి చెందిన గొర్ల సత్యనారాయణరెడ్డి, వైరా మండలం వల్లాపురానికి చెందిన తుమ్మల రాణాప్రతాప్ అవార్డులు స్వీకరించారు.

'సీతారామ' సొరంగం పనులు పరిశీలన



సొరంగ మార్గంలో పనులను పరిశీలిస్తున్న ఈఈ చంద్రశేఖర్, అధికారులు

తిరుమలాయపాలెం/ఖమ్మం అర్బన్: సీతారామ ప్రాజెక్టులో భాగంగా మండలంలోని దమ్మాయిగూడెం కూసుమంచి మండలంలోని పోచారం వరకు చేపట్టిన సొరంగ మార్గం(టన్నెల్) పనులను సెంట్రల్ డిజైనింగ్ ఆర్గనైజేషన్ ఈఈ చంద్రశేఖర్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సొరంగ మార్గం పనులలో చేపడుతున్న పనులు, భద్రతా చర్యలపై జిల్లా అధికారులను అడిగి తెలుసుకున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లాలోని ఎస్ఎల్‌బీసీ సొరంగం వద్ద ప్రమాదం జరిగిన నేపథ్యాన ఈఈ ఇక్కడ పనులను పరిశీలించినట్లు తెలుస్తోంది. అలాగే, ఖమ్మం కార్పొరేషన్, రూరల్ మండలాల పరిధిలో మున్నేటికి ముంపు నుంచి రక్షణకు నిర్మిస్తున్న రిటైనింగ్ వాల్ పనులను సైతం ఈఈ చంద్రశేఖర్, జేఈ దినేష్ పరిశీలించారు. గత ఏడాది నమోదైన వరద, ఇరువైపులా జరిగిన నష్టంపై ఆరా తీశారు. ఈకార్యక్రమాల్లో జలవనరులశాఖ ఎస్ఈ మంగళపూడి వెంకటేశ్వర్లు, ఈఈలు వెంకటేశ్వర్లు, అనన్య, డీఈలు బాణాల రమేష్‌రెడ్డి, ఉదయ్‌ప్రతాప్, మన్మథరావు, ఏఈలు సంఘప్రియ, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

మార్పులకు అనుగుణంగా బోధించాలి

నూతన ఉపాధ్యాయుల శిక్షణలో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



శిక్షణలో మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మం సహకారనగర్: విద్యావిధానంలో వస్తున్న మార్పులు, పిల్లల సామర్థ్యాలపై అవగాహన పెంచుకుని బోధించాలని, తద్వారా ప్రభుత్వ పాఠశాలలో చదివే పిల్లల జీవితాల్లో మార్పు తీసుకురావొచ్చని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. తాజాగా డీఎస్సీ ద్వారా ఎంపికైన ఉపాధ్యాయులకు ఖమ్మం ఎన్నెస్పీ కాలనీ, రిక్కాబజార్ పాఠశాలలో శుక్రవారం ఏర్పాటు శిక్షణలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన ఎందరో గొప్పస్థాయికి చేరారని తెలిపారు. తల్లిదండ్రుల కంటే ఎక్కువ బాధ్యత ఉపాధ్యాయులపైనే ఉందని గుర్తించి బోధించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అవసరమైన వసతులను ప్రభుత్వం కల్పిస్తున్నందున టీచర్లు తమ వంతు బాధ్యత పోషించాలని తెలిపారు. అనంతరం విధినిర్వహణలో మూడు నెలల కాలంలో గుర్తించిన పరిస్థితులు, బోధన వివరాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. డీఈఓ సోమశేఖరశర్మ, ఏఎంఓ రవికుమార్, స్టేట్ రిసోర్స్‌పర్సన్ కృష్ణారావు, ఖమ్మం అర్బన్ ఎంఈఓ శైలజాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్ లేకున్నా రిజిస్ట్రేషన్లకు ఓకే..

- రిజిస్ట్రేషన్‌తో పాటే ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు చెల్లించేలా మార్గదర్శకాలు
- ఎన్నికల కోడ్ ముగియగానే అమలు



ఖమ్మంమయూరిసెంటర్: 2020 ఏడాదికి ముందు అనుమతి లేకుండా ఏర్పాటు చేసిన వెంచర్లలోని ప్లాట్ల రిజిస్ట్రేషన్‌కు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇందుకోసం ఎల్‌ఆర్‌ఎస్ కింద 2020లో దరఖాస్తు చేసుకున్న ప్లాట్ల యజమానులు రిజిస్ట్రేషన్ సమయాన ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. ఇందుకు సంబంధించి ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. అనుమతులు లేకుండా వేసిన వెంచర్లలో పది శాతం ప్లాట్లు రిజిస్ట్రేషన్ అయి ఉంటే లింక్ డాక్యుమెంట్లతో పని లేకుండానే రిజిస్ట్రేషన్ చేసేలా ఈ ఉత్తర్వుల్లో పొందుపరిచారు. అంతేకాక ఎల్‌ఆర్‌ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్న ప్లాట్లకు సంబంధించి రిజిస్ట్రేషన్, ఫీజు వసూలు అంశాలపై ప్రభుత్వం ఉత్తర్వులతో పాటు ప్రత్యేక మాడ్యూల్ సైతం విడుదల చేసింది. ఫలితంగా ఉమ్మడి జిల్లాలోని 11 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో 2020 ఏడాది కంటే ముందే వేసిన వెంచర్లల్లోని ప్లాట్లకు రిజిస్ట్రేషన్లు జరగనున్నాయి.

ఎన్నికల కోడ్ ముగియగానే..

ఉమ్మడి జిల్లా పరిధిలో ప్రస్తుతం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లో ఉంది. దీంతో ప్రభుత్వం ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు రాయితీ ప్రకటించినా ఇంకా అమల్లోకి రాలేదు. కోడ్ ముగిశాక రాయితీ అమల్లోకి వస్తుందని, ఆపై 2020 ఏడాదికి ముందు వేసిన వెంచర్లలో ప్లాట్లు కొనుగోలు చేసిన వారు నేరుగా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఫీజు చెల్లించి రిజిస్ట్రేషన్ చేయించుకోవచ్చని చెబుతున్నారు. తద్వారా రిజిస్ట్రేషన్ సంఖ్యతో పాటే ప్రభుత్వానికి ఆదాయం పెరగనుంది.

ముప్పై రోజుల్లో ఎల్‌ఆర్‌ఎస్ పూర్తి

ఖమ్మం సహకారనగర్: జిల్లాలో 70 వేల ఎల్‌ఆర్‌ఎస్ పెండింగ్ దరఖాస్తులను రానున్న 30 రోజుల్లో పరిష్కరించాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆదేశించారు. హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఇంటర్ పరీక్షల నిర్వహణ, ఎల్‌ఆర్‌ఎస్‌పై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సూచనలు చేయగా కలెక్టర్‌తో పాటుపోలీస్ కమిషనర్ సునీల్‌దత్, అదనపు కలెక్టర్లు డాక్టర్ పి.శ్రీజ, పి.శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ వివిధ శాఖల అధికారులతో సమావేశమయ్యారు. రెవెన్యూ, ఇరిగేషన్, టౌన్ ప్లానింగ్ అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిశీలన పూర్తిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో జెడ్పీ సీఈఓ దీక్షారైనా, డీపీఓ ఆశాలత, డీఎంహెచ్ఓ డాక్టర్ కళావతి బాయి, ఆర్డీఓలు నరసింహారావు, ఎల్.రాజేందర్, డీఐఈఓ రవిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఇంకా ఆమడదూరంలోనే...

- జిల్లాలోని మార్కెట్ల పన్నుల లక్ష్యం రూ.63.94 కోట్లు
- ఇప్పటి వరకు వసూలైంది రూ.44.70 కోట్లే
- సీజన్ ముగుస్తున్నా లక్ష్యసాధనలో వెనుకబాటు



ఖమ్మం మార్కెట్‌కు విక్రయానికి తీసుకొచ్చిన మిర్చి

ఖమ్మంవ్యవసాయం: ఆర్థిక సంవత్సరం చివరి దశకు చేరినా మార్కెటింగ్ శాఖ నిర్దేశించిన లక్ష్యాల సాధనలో జిల్లాలోని వ్యవసాయ మార్కెట్లు దూరంగానే ఉన్నాయి. వానాకాలం పంటల సీజన్ పూర్తవుతున్నా పన్నులు ఇంకా భారీగా మిగిలి ఉండడం గమనార్హం. జిల్లాలో ఖమ్మం, మధిర, నేలకొండపల్లి, కల్లూరు, వైరా, ఏన్కూరు, సత్తుపల్లి, మద్దులపల్లి వ్యవసాయ మార్కెట్లు, వీటి పరిధిలో 21 చెక్‌పోస్టులు ఉన్నాయి. ఎనిమిది మార్కెట్లకు గాను ఈ ఆర్థిక సంవత్సరం రూ.54.35 కోట్ల లక్ష్యంతో పాటు బకాయిలు కలిపి రూ.63.94కోట్ల మేర వసూలు చేయాల్సి ఉంది. అయితే, ఇందులో ఇప్పటివరకు రూ.44.70కోట్ల(69.91 శాతం) మాత్రమే వసూలైంది.

ఇంకో నెల మాత్రమే గడువు

పన్ను వసూళ్ల లక్ష్యాన్ని చేరేందుకు ఇంకా నెల మాత్రమే గడువు ఉంది. ఈ సమయంలో రూ.19కోట్ల మేర వసూలు చేయడం సాధ్యమేనా అన్న ప్రశ్న తలెత్తుతోంది. గత ఏడాది యాసంగి నుంచి ఈ ఏడాది వానాకాలం పంటల సీజన్ వరకు మార్కెట్లలో పంటల క్రయ విక్రయాలపై వ్యాపారులు, కొనుగోలుదారుల నుంచి పన్ను వసూలు చేయాల్సి ఉంది. కాగా, జిల్లాలోని కల్లూరు మార్కెట్ 86.68 శాతంతో ముందంజలో ఉండగా, మద్దులపల్లి మార్కెట్ 56.82 శాతంతో చివరి స్థానాన నిలిచింది. మిగిలిన మార్కెట్లు 60 నుంచి 80 శాతం వరకు పన్నులు వసూలు చేశాయి. ఇక రాష్ట్రంలోనే పెద్దదైన ఖమ్మం మార్కెట్ బకాయిలతో కలిపి రూ.30కోట్లలో రూ.19.70 కోట్లు వసూలు కాగా ఇంకా రూ.10కోట్లకు పైగా వసూలు కావాల్సి ఉంది.

సీసీఐ, పౌరసరఫరాల నుంచి..

రైతులు పండించిన పంటలకు మద్దతు ధర కల్పించేలా పలు ప్రభుత్వ రంగ సంస్థలు కొనుగోలు చేశాయి. రాష్ట్ర ప్రభుత్వం పౌరసరఫరాల శాఖ ద్వారా ధాన్యం, కేంద్ర ప్రభుత్వం సీసీఐ ద్వారా పత్తి కొనుగోళ్లు చేపట్టింది. ఈ రెండు సంస్థలు కొనుగోలు చేసిన పంటల విలువలో ఒక శాతం పన్ను మార్కెటింగ్ శాఖకు చెల్లించాల్సి ఉంటుంది. ఇక పాత బకాయిలు కొంత మేరకు చెల్లించినా ఇంకా వసూలు కావాల్సి ఉంది. ఈ పన్నులు కూడా జమ అయితే లక్ష్యసాధనలో కొంత పురోగతి కనిపిస్తుందని చెబుతున్నారు.

గడువులోగా లక్ష్యాన్ని చేరతాం..



మార్కెట్ ఫీజుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాం. బకాయి ఉన్న ఏజెన్సీలకు ఇప్పటికే నోటీసులు జారీ చేశాం. ట్రేడర్లు కొనుగోలు చేసిన పంటలకు సంబంధించి బకాయిల వసూళ్లకు ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతున్నాం. ఆర్థిక సంవత్సరం ముగింపు నాటికి లక్ష్యం మేర పన్నులు వసూలు చేస్తాం.

– ఎం.ఏ.అలీం, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి

మార్కెట్ల వారీగా పన్నుల లక్ష్యం వివరాలు (రూ.లక్షల్లో)

మార్కెట్	లక్ష్యం	వసూలు	శాతం
కల్లూరు	567.38	491.80	86.68
వైరా	673.58	533.66	79.23
సత్తుపల్లి	494.79	388.67	78.55
మధిర	475.19	352.82	74.25
నేలకొండపల్లి	378.34	260.38	68.82
ఖమ్మం	3,002.85	1,970.16	65.61
ఏన్కూరు	487.70	293.97	60.28
మద్దులపల్లి	315.10	179.04	56.82
మొత్తం	6,394.93	4,470.50	69.91

మార్కెటింగ్ శాఖ ప్రత్యేక దృష్టి

ఆర్థిక సంవత్సరం ముగియవస్తుండడంతో మార్కెటింగ్ శాఖ అధికారులు పన్నుల వసూళ్లపై దృష్టి సారించారు. మార్కెట్ కమిటీల కార్యదర్శులతో అధికారులు తరచుగా సమీక్షిస్తూ సూచనలు చేస్తున్నారు. ఇదే సమయాన పంటల విక్రయాలు జరుగుతున్నా లక్ష్యాన్ని చేరకపోవడంపై పలు మార్కెట్ల అధికారుల నుంచి వివరణ అడిగినట్లు సమాచారం. నిర్దేశిత గడువులోగా మార్కెట్లు, చెక్‌పోస్టులతో పాటు గోదాంల నుంచి రావాల్సిన పన్నులు వసూలు చేయాలని ఆదేశించారు.

క్లుప్తంగా

ప్రచార వాహనాలు ప్రారంభం

ఎర్రుపాలెం: జమలాపురం శ్రీవేంకటేశ్వరస్వామి వారి ఆలయ ప్రాంగణంలో తుళ్లూరు కోటేశ్వరరావు–నిర్మల విరాళంతో నిర్మించిన వకుళామాత స్టేడియంను ఈనెల 7న ప్రారంభించనున్నారు. ఇదేరోజు హోమం జరగనుండగా తెలంగాణ, ఏపీలో వాహనాల ద్వారా ప్రచారం చేయనున్నారు. ఈ వాహనాను శుక్రవారం ప్రారంభించగా, దాత కోటేశ్వరరావు, ఆలయ ప్రధాన అర్చకుడు ఉప్పల శ్రీనివాస శర్మ, సూపరింటెండెంట్ విజయకుమారితో పాటు నారాయణరెడ్డి పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి విరాళం



దాతలకు రశీదు ఇస్తున్న ఉద్యోగులు

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామివారి దేవస్థానంలో జరిగే శాశ్వత నిత్యాన్నదాన కార్యక్రమానికి శుక్రవారం భక్తులు విరాళం అందజేశారు. ఖమ్మం శ్రీనివాసనగర్ కాలనీకి చెందిన ముసునూరి రామారావు – విజయకుమారి దంపతులు రూ.1,00,116 చెక్కును ఆలయ అధికారులకు అందజేశాక స్వామిని దర్శించుకున్నారు.

రక్తదానానికి యువత ముందుకు రావాలి



శిబిరంలో మాట్లాడుతున్న చంద్రమోహన్

ఖమ్మం మామిళ్లగూడెం: ఆపదలో ఉన్న వారిని ఆదుకునేలా యువత ముందుకొచ్చి రక్తదానం చేయాలని రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ డాక్టర్ వెలిగేటి చంద్రమోహన్ సూచించారు. రెడ్‌క్రాస్, లయన్స్ క్లబ్ ఆధ్వర్యాన ఖమ్మంలో శుక్రవారం నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈశిబిరంలో 80 మంది రక్తదానం చేయగా, దారా కృష్ణారావు, జి.సూర్యప్రకాశరావు, గోవర్ధన్‌రావు, కేదాసు నరసయ్య, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఖాతాలో నగదు జమ చేయలేదని ఆందోళన

కారేపల్లి: స్వయం సహాయక సంఘం సభ్యులకు సంబంధించి రూ.49,500 నగదును ఖాతాలో జమ చేయలేదంటూ కారేపల్లి బీసీ కాలనీకి చెందిన ఎస్‌హెచ్‌జీ సభ్యులు సీఎస్‌పీ (కస్టమర్ సర్వీస్ పాయింట్) ఎదుట శుక్రవారం ఆందోళనకు దిగారు. అయితే, సీఎస్‌పీ నిర్వాహకులు మాత్రం నగదు ఇస్తే రశీదు చూపించాలని పేర్కొనడంతో వివాదం జఠిలమైంది. ఈమేరకు రికార్డులు బయట పెట్టాలని సభ్యులు డిమాండ్ చేయగా, తమ వద్ద రికార్డులు ఉండవని, ఆన్‌లైన్‌లో చూపిస్తామని నిర్వాహకులు బదులివ్వడంతో గందరగోళం నెలకొంది. ఈవిషయమై సమాచారం అందుకున్న కారేపల్లి పోలీసులు చేరుకుని ఇరువర్గాలకు చర్చించారు. ఏదైనా ఉంటే ఫిర్యాదు చేయాలే తప్ప ఆందోళనలు చేయొద్దని సూచించడంతో పంచాయితీ పోలీసుస్టేషన్‌కు చేరింది.

గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

ఖమ్మంరూరల్: మండలంలోని పల్లెగూడెం వద్ద సాగర్ కాల్వలో మునిగి గల్లంతైన గోలి అశోక్(38) మృతదేహం వి.వెంకటాయపాలెం లాక్‌ల వద్ద శుక్రవారం లభ్యమైంది. మండలంలోని ఇందిరమ్మ కాలనీకి చెందిన అశోక్ మహాశివరాత్రి రోజున మరో స్నేహితుడితో కలిసి సాగర్ కాల్వలో స్నానానికి వెళ్లగా ప్రమాదశాత్తు కాలు జారి పడడంతో కొట్టుకుపోయాడు. ఈమేరకు పోలీసులు, అన్నం ఫౌండేషన్ చైర్మన్ అన్నం శ్రీనివాసరావు బృందంతో గాలింపు చేపట్టగా మృతదేహం లభించింది. ఘటనపై కేసు నమోదు చేసినట్లు సీఐ ముష్కరాజు తెలిపారు.

మద్యం మత్తులో చిన్నారిపై లైంగిక దాడికి యత్నం

పెనుబల్లి: పెనుబల్లి మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఆరేళ్ల బాలికపై మద్యం మత్తులో ఓ వ్యక్తి లైంగిక దాడికి యత్నిస్తుండగా చుట్టుపక్కల వారు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. చిన్నారి కుటుంబీకులు శుక్రవారం కూలీ పనులకు వెళ్లారు. ఇంట్లో పెద్దలు మాత్రమే ఉండగా, అదే గ్రామానికి చెందిన దుంపా వెంకటేశ్వరరావు పాపకు పప్పులు ఇస్తానని నమ్మించి తమ ఇంట్లోకి తీసుకెళ్లాడు. ఈ విషయాన్ని గమనించిన స్థానికులు ఆయన ఇంట్లోకి వెళ్లి చూడగా మద్యం మత్తులో లైంగిక దాడికి యత్నిస్తున్నట్లు తెలియడంతో దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. ఈమేరకు నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు వీఎం బంజరు ఎస్సై కె.వెంకటేష్ తెలిపారు. శనివారం ఉదయం బాలికకు వైద్య పరీక్షలు చేయించడంతో పాటు నిందితుడిని కోర్టులో హాజరుపరుస్తామని వెల్లడించారు.

పేకాడుతున్న వారిపై కేసు

నేలకొండపల్లి: మండలంలోని సుర్దేపల్లిలో శుక్రవారం పోలీసులు తనిఖీలు చేపట్టగా పేకాట ఆడుతున్న నలుగురు పట్టుబడడంతో కేసు నమోదు చేశారు. మరో ఇద్దరు పరారు కాగా, పట్టుబడిన వారి నుంచి రూ.1,970 నగదు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

జాగా కొలిచేదెట్లా?

- ల్యాండ్ రికార్డ్స్ అండ్ సర్వే విభాగంలో సిబ్బంది కొరత
- రెండు సర్వేయర్.. 19 డిప్యూటీ సర్వేయర్ పోస్టులు ఖాళీ
- ఉమ్మడి జిల్లాలో 445 దరఖాస్తుల పెండింగ్
- ఏళ్లు గడుస్తున్నా హద్దులు, కొలతలు తేలని భూ వివాదాలు



ఓ రైతు సర్వే కోసం దరఖాస్తు చేసుకున్న భూమి

పాల్వంచరూరల్: ఉమ్మడి జిల్లాలో భూ సర్వే సమస్యలు పేరుకుపోతున్నాయి. గత ప్రభుత్వం తెచ్చిన ధరణి వ్యవస్థతో హద్దులు, కొలతలకు సంబంధించిన అర్జీలు కూడా పెరిగిపోతున్నాయి. చాలా సర్వే నంబర్లలో భూ వివాదాలు నెలకొన్నాయి. మరోవైపు కొలత వేసి హద్దులు నిర్ధారించే, మ్యాపులు అందించే సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ శాఖలో ఖాళీ పోస్టులు భర్తీకి నోచుకోవడంలేదు. సర్వేయర్లు, డిప్యూటీ సర్వేయర్, చైన్‌మన్లు ఇతర సిబ్బంది కొరత తీవ్రంగా ఉంది. దీంతో ఉన్నవారు పని ఒత్తిడిని ఎదుర్కొవాల్సివస్తోంది.

సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ విభాగంలో డిప్యూటీ డైరెక్టర్, అసిస్టెంట్ డైరెక్టర్, సర్వేయర్, డిప్యూటీ సర్వేయర్, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు, చైన్‌మన్ తదితర 18 రకాల పోస్టులు ఉంటాయి. పెరుగుతున్న అవసరాల రీత్యా అదనపు పోస్టులను మంజూరు చేయకపోగా ప్రభుత్వం ఉన్న పోస్టులను కూడా భర్తీ చేయడం లేదు. ఉమ్మడి జిల్లాలో మొత్తం 114 పోస్టులు ఉండగా, ప్రస్తుతం 74 మంది సిబ్బంది పనిచేస్తున్నారు. ఇంకా 40 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటిలో కీలకమైన డిప్యూటీ సర్వేయర్ పోస్టులు 19 ఖాళీగా ఉన్నాయి. ఖమ్మం జిల్లాలో డిప్యూటీ సర్వేయర్ 11, చైన్‌మన్ పోస్టులు 3, ఇతర సిబ్బంది 9 పోస్టులను భర్తీ చేయాల్సి ఉంది. భద్రాద్రి జిల్లాలో సర్వే ఇన్‌స్పెక్టర్ ఒకటి, సర్వేయర్ 2, డిప్యూటీ సర్వేయర్ 8, చైన్‌మన్ ఒకటి, ఇతర సిబ్బంది పోస్టులు ఐదు ఖాళీగా ఉన్నాయి. అనేక మండలాల్లో అధికారుల కొరత ఉండటంతో ఇతర మండలాలవారికి అదనపు బాధ్యతలు అప్పగించారు. దీంతో పనిభారం పెరిగి భూముల హద్దుల గుర్తింపు అర్జీలు పరిష్కరించలేకపోతున్నారు. ఫలితంగా భూ సర్వే కోసం దరఖాస్తుదారులు ఏళ్ల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది.

45 రోజుల్లో పరిష్కరించాల్సి ఉన్నా...

భూ పంపకాలు, భూ యజమానుల మధ్య గట్టు వివాదాలు తలెత్తినా, క్రయ, విక్రయాల సమయంలో సర్వే కోసం దరఖాస్తు చేసుకుంటారు. నిబంధనల ప్రకారం సర్వే దరఖాస్తులను తహసీల్దార్లు పరిశీలించి 45 రోజుల్లో పరిష్కరించాల్సి ఉంటుంది. సర్వేయర్లతో భూ కొలతలు తీసుకుని దరఖాస్తుదారుడికి నివేదికలు అందించాల్సి ఉంటుంది. కానీ సర్వేయర్, డిప్యూటీ సర్వేయర్ల కొరత కారణంగా భూ కొలతలు ఎప్పుడు చేపడతారో తెలియని పరిస్థితి నెలకొంది.

రీ సర్వే జరగక సమస్యలు జఠిలం..

జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్, అటవీ ఇతర భూములపై రీ సర్వే జరగకపోవంతో సమస్యలు పరిష్కారం కావడం లేదని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. అనేక చోట్ల స్పష్టమైన హద్దుల్లేక అనుభవదారుల మధ్య వివాదాలు తలెత్తుతున్నాయి. గ్రీవెన్స్‌డేతో పాటు తహసీల్దార్ కార్యాలయాల్లో వీటికి సంబంధించిన ఫిర్యాదులే ఎక్కువగా వస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం దృష్టి సారించి సర్వేశాఖలోని ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని, అదనపు పోస్టులను మంజూరు చేయాలని పలువురు కోరుతున్నారు.

దరఖాస్తుల వివరాలు ఇలా..

భద్రాద్రి జిల్లా వ్యాప్తంగా 2016 నుంచి ఇప్పటివరకు భూ కొలతల కోసం 7,123 దరఖాస్తులు అందాయి. ఇందులో 5,311 దరఖాస్తులను తిరస్కరించారు. 76 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. ఖమ్మం జిల్లా వ్యాప్తంగా 21 మండలాల నుంచి 2021 నుంచి ఇప్పటివరకు 13,726 దరఖాస్తులు రాగా, వీటిలో 6,354 దరఖాస్తులను తిరస్కరించారు. మరో 369 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. మిగిలిన అర్జీలను పరిష్కరించారు.

ఉమ్మడి జిల్లాలో సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ విభాగంలో పోస్టుల వివరాలు..

జిల్లా	మొత్తం పోస్టులు	పనిచేస్తున్న సిబ్బంది	ఖాళీలు
ఖమ్మం	62	39	23
భద్రాద్రి	52	35	17
మొత్తం	114	74	40

అదనపు పోస్టులేవి..?

నూతన జిల్లాల ఏర్పాటు తర్వాత నూతన పోస్టులు మంజూరు కాలేదు. ఖాళీలూ భర్తీ చేయలేదు. దీంతో భద్రాద్రి జిల్లా ఏడీగా ఖమ్మం జిల్లా ఏడీ శ్రీనివాసరావుకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన భూ భారతి చట్టం అమల్లోకి వస్తే భూమి రిజిస్ట్రేషన్, మ్యుటేషన్‌కు భూ పటం(నక్ష) తప్పనిసరి అవుతుందని అధికారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం డిప్యూటీ సర్వేయర్ల పోస్టుల్లో పూర్వ వీఆర్వో, వీఆర్‌ఏల్లో ఆసక్తి కలిగిన వారిని నియమించేందుకు కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. ఖాళీ పోస్టుల భర్తీపై భూమి కొలతలు, రికార్డుల నిర్వహణ శాఖ ఏడీ శ్రీనివాస్‌రావును వివరణ కోరగా.. సర్వేయర్లు, డిప్యూటీ సర్వేయర్లు, ఇతర సిబ్బంది పోస్టులు భర్తీ చేయాల్సి ఉందని తెలిపారు. భూ సర్వేశాఖ పునర్‌వ్యవస్థీకరణపై ప్రభుత్వం దృష్టి సారించిందని ఆయన వివరించారు.

పట్టుదలతో ప్రయత్నిస్తే విజయం సాధ్యమే..

ఎస్‌బీఐటీలో 'ఐడియాథాన్'ను ప్రారంభించిన కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్



జ్యోతిప్రజ్వలన చేస్తున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, పక్కన గుండాల కృష్ణ తదితరులు

ఖమ్మం సహకారనగర్: విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకోవడమే కాకుండా పట్టుదలతో ప్రయత్నిస్తే విజయం సొంతమవుతుందని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. ఖమ్మంలోని ఎస్‌బీఐటీలో తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ నాలెడ్జి(టాస్క్) ఆధ్వర్యాన ఏర్పాటుచేసిన జిల్లా స్థాయి ఐడియాథాన్‌ను కలెక్టర్ శుక్రవారం ప్రారంభించి మాట్లాడారు. ఇంటర్నెట్ యుగంలో ప్రపంచమే కుగ్రామంలా మారినందున విద్యార్థులు మానవ మేధస్సే కర్మాగారమని గుర్తించి తమ ఆలోచనలకు పదును పెట్టాలని సూచించారు. కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ మాట్లాడుతూ అన్ని రంగాల్లో రాణిస్తున్న ఈ తరం విద్యార్థులు రానున్న రోజుల్లో అద్భుతాలు సృష్టిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. టాస్క్ రిలేషన్‌షిప్ మేనేజర్ దినేష్, ప్రాజెక్ట్ మేనేజర్ బి.బాలుప్రవరాఖ్య మాట్లాడుతూ జిల్లాస్థాయిలో పది కళాశాలల నుంచి 313 థీమ్‌లు పంపారని, అందులో 56 ఎంపిక చేయగా 186 మంది విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. ఇక్కడి నుంచి మెరుగైన థీమ్‌లను రాష్ట్ర స్థాయి పోటీలకు పంపిస్తామని వెల్లడించారు. కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ డాక్టర్ జి.ధాత్రి, అకడమిక్ డైరెక్టర్లు గుండాల ప్రవీణ్‌కుమార్, గంధం శ్రీనివాసరావు, శివప్రసాద్, రవీంద్రబాబు, శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ జి.రాజ్‌కుమార్‌తో పాటు అర్జున్, శ్రీరామ్ సంకీర్త్ తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగులకు సన్మానం



సివిల్ సప్లయీస్ డీటీ సీతారామచంద్రరావు దంపతులను సన్మానించిన కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, అధికారులు

ఖమ్మం సహకారనగర్/ఖమ్మం క్రైం: జిల్లాలోని వివిధ శాఖల్లో విధులు నిర్వర్తిస్తూ శుక్రవారం ఉద్యోగ విరమణ చేసిన 15మంది ప్రభుత్వ ఉద్యోగులను కలెక్టరేట్‌లో సన్మానించారు. ఈసందర్భంగా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ ఏళ్ల పాటు నిర్విరామంగా విధులు నిర్వర్తించిన ఉద్యోగుల సేవలు మరువలేనివని తెలిపారు. అనంతరం అదనపు కలెక్టర్లు డాక్టర్ పి.శ్రీజ, పి.శ్రీనివాసరెడ్డి మాట్లాడగా జెడ్పీ సీఈఓ దీక్షారైనా, డీఎంహెచ్‌ఓ కళావతిబాయి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. అలాగే, పోలీసు శాఖలో ఉద్యోగ విరమణ చేసిన ఎల్.శ్రీనివాసరావు(పీసీఆర్), మైసయ్య (ఏఆర్ ఎస్ఐ), వీరస్వామి(ఏఆర్ ఎస్ఐ), ఎం.డీ.అజ్మతుల్లా(ఏఎస్సైఐ, తిరుమలాయపాలెం)ను కమిషనరేట్‌లో సీపీ సునీల్‌దత్ సన్మానించారు. అదనపు డీసీపీలు ప్రసాద్‌రావు, కుమారస్వామి, ఏఆర్ ఏసీపీలు నర్సయ్య, సుశీల్‌సింగ్, ఆర్ఐ అప్పలనాయుడు, పోలీస్ అసోసియేషన్ బాధ్యులు వెంకటేశ్వర్లు, మోహన్‌రావు, పంతులు పాల్గొన్నారు.



ఉద్యోగ విరమణ చేసిన వారితో సీపీ సునీల్‌దత్, అధికారులు

కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరాటాలకు సిద్ధంగా ఉండాలి



అభివాదం చేస్తున్న మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు సుధాకర్, నాయకులు

ముదిగొండ: రాజ్యాంగ స్ఫూర్తిగా విరుద్ధంగా వ్యవహరిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరాటానికి సిద్ధంగా ఉండాలని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ పిలుపునిచ్చారు. ముదిగొండ శుక్రవారం నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా వ్యవహరిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని ప్రయత్నిస్తోందని విమర్శించారు. ఈనేపథ్యాన ప్రభుత్వం పోరాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను ఓడించాలని కార్యకర్తలను కోరారు. తొలుత అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించగా మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు ఉండేటి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర, జిల్లా కార్యదర్శులు వేల్పుల జానయ్య, వేల్పుల లక్ష్మణరావు, నాయకులు రామనాథం, భరత్, శ్రీరాములు, రాంబాబు, పిచ్చయ్య, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ హెచ్‌ఎం ఇంట్లో భారీ చోరీ

రూ.25 లక్షల విలువైన నగదు, ఆభరణాలు అపహరణ



మినీ లాకర్ తీసుకెళ్లేందుకు ధ్వంసం చేసిన కప్ బోర్డు



ఆభరణాలు, నగదు తీసుకున్నాక వదిలేసిన లాకర్

మంఅర్బన్: శుభకార్యంలో పాల్గొనేందుకు కుమార్తె వద్దకు వెళ్లిన రిటైర్డ్ హెచ్‌ఎం ఇంట్లో చొరబడిన దొంగలు ఉన్నదంతా ఊడ్చుకెళ్లారు. రూ.25లక్షలకు పైగా విలువైన నగదు, ఆభరణాలు చోరీ అయిన ఘటన ఖమ్మంలో శుక్రవారం వెలుగు చేసింది. నగరంలోని 11వ డివిజన్ వరదయ్యనగర్‌లోని రితిక అపార్ట్‌మెంట్‌లో నివాసముండే రిటైర్డ్ హెచ్‌ఎం చల్లా శ్రీనివాసరావు కుటుంబం రెండు రోజుల క్రితం హైదరాబాద్‌లో కుమార్తె వద్దకు వెళ్లింది. గురువారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తి ఫ్లాట్ తాళం పగులగొట్టి కప్ బోర్డులోని మినీ లాకర్‌ను పలుగుతో పెకిలించి తీసుకెళ్లినట్లు సీసీ కెమెరాల పుటేజీలో నమోదైంది. దీన్ని కిందకు తీసుకెళ్లి లాకర్‌ను ధ్వంసం చేసి అందులో రూ.3లక్షల నగదు, 250 గ్రాముల బంగారం ఆభరణాలు, బిస్కెట్లను ఎత్తుకెళ్లాడు. రాత్రి ఒంటి గంట సమయాన ఫ్లాట్‌లోకి ప్రవేశించిన దొంగ సుమారు గంటకు పైగా అంతా వెతికినట్లు గుర్తించారు. కాగా, శుక్రవారం ఉదయం వాచ్‌మెన్ ఫ్లోర్‌ను శుభ్రం చేసే క్రమాన ఫ్లాట్ ఎదుట సామగ్రి పడి ఉండడంతో ఫోన్‌లో శ్రీనివాసరావుకు సమాచారం ఇవ్వగా ఆయన చేరుకుని చోరీ అయినట్లు గుర్తించి ఖమ్మం అర్బన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో నగర ఏసీపీ రమణమూర్తి, సీఐ భానుప్రకాష్ ఫ్లాట్‌లో పరిశీలించి ఆధారాలు సేకరించారు.

టోపీ పెట్టుకుని.. మాస్క్ ధరించి

పది ఫ్లాట్లు ఉన్న అపార్ట్‌మెంట్‌లోని మూడో అంతస్తులో శ్రీనివాసరావు నివాసముంటున్నాడు. నిందితుడు చేతిలో గడ్డపలుగుతో రావడమే కాక ఎవరూ గుర్తుపట్టకుండా తలకు టోపీ, ముఖానికి మాస్కు పెట్టుకున్నట్లు సీసీ కెమెరాలో నమోదైంది. తొలుత ఈ అపార్ట్‌మెంట్‌కు ఎదురుగా ఉన్న మరో అపార్ట్‌మెంట్‌లోకి వెళ్లిన నిందితుడు కాసేపు అక్కడ తచ్చాడక గోడ దూకి వచ్చినట్లు గుర్తించారు. ఈమేరకు పోలీసులు సేకరించిన ఆధారాలతో దర్యాప్తు చేపట్టారు.

కమీషన్ల కక్కుర్తి..

- స్టాంప్ పేపర్ల విలువపై అదనపు వసూళ్లు
- రూరల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బంది తీరుపై విమర్శలు

ఖమ్మంమయూరిసెంటర్: స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖలో ఉద్యోగుల అవినీతిపై ఆరోపణలు నానాటికీ పెరుగుతున్నాయే తప్ప ఎక్కడా అడ్డుకట్ట పడడం లేదు. పలువురు ఏసీబీకి చిక్కినా, కొందరిని బదిలీ చేసినా మిగతా ఉద్యోగులు తమ దందా ఆపడం లేదని తెలుస్తోంది. అన్ని పత్రాలు సక్రమంగా ఉన్నా రిజిస్ట్రేషన్ చేయడానికి కూడా కమీషన్లు అడుగుతున్నారన్న విమర్శలు ఉండగా.. ఇప్పుడు ఖమ్మం రూరల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బంది మరో అడుగు ముందుకేశారు. స్లాంటప్ పేపర్లు తీసుకెళ్లే లైసెన్సు వెండర్లను వదలకుండా కమీషన్ వసూలు చేస్తున్నట్లు తెలిసింది.

క్రయవిక్రయాల్లో అవసరం

పలు అగ్రిమెంట్లతో పాటు ఆస్తులు, భూముల క్రయవిక్రయాల సమయాన రెవెన్యూ స్టాంపు పేపర్లను వినియోగిస్తుంటారు. వీటిని రిజిస్ట్రేషన్ శాఖ స్టాంప్ వెండర్ల ద్వారా విక్రయిస్తోంది. ఇందుకోసం పలువురు లైసెన్సు పొంది కార్యాలయం ద్వారా తీసుకునే స్టాంప్ పేపర్లను ప్రజలకు విక్రయిస్తుంటారు. ఇందుకోసం వీరికి కమీషన్ వస్తుంది. అయితే కొందరు స్టాంప్ వెండర్లు అధికంగా వసూలు చేస్తున్నారనే విమర్శలు ఉండగా.. ఎలాగూ ఎక్కువకే అమ్ముతున్నందున అందులో కొంత వాటా తమకు చెల్లించాలని ఖమ్మం రూరల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బంది డిమాండ్ చేస్తున్నట్లు సమాచారం. స్టాంప్‌ల అమ్మకంపై వెండర్లకు 5శాతం కమీషన్ అందుతుంది. అయితే, రూరల్ కార్యాలయ సిబ్బంది ఈ కమీషన్ ఇవ్వకపోగా అదనంగా 10 శాతం వసూలు చేస్తున్నారని సమాచారం. ఇటీవల ఓ స్టాంప్ వెండర్ రూ.15వేల విలువైన రూ.20, రూ.100 స్టాంప్ పేపర్లు కొనుగోలు చేయగా.. రూ.1,500 అదనంగా తీసుకున్నారని తెలిసింది. కార్యాలయంలోనే అదనంగా వసూలు చేస్తున్నప్పుడు తాము మరింత ఎక్కువగా విక్రయించక తప్పడం లేదని వెండర్లు చెబుతున్నారు. ఈవిషయమై ఖమ్మం రూరల్ సబ్ రిజిస్ట్రార్ అరుణను వివరణ కోరగా స్టాంపు పేపర్లపై అదనంగా డబ్బు తీసుకుంటున్నారనే అంశంపై తమకెలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు. ఎవరైనా ఫిర్యాదు చేస్తే సిబ్బందిపై చర్యలు తీసుకోవడమేకాక అదనంగా తీసుకున్న నగదు తిరిగి ఇపిస్తామని వెల్లడించారు.

ఏసీబీకి చిక్కిన హెచ్‌ఎం

రూ.20 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడిన రవీందర్

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం లంచం తీసుకుంటూ శుక్రవారం ఏసీబీకి పట్టుబడ్డాడు. ఏసీబీ డీఎస్పీ రమేష్ కథనం ప్రకారం.. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కరాటే నేర్పేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏడాది పాఠశాలకు రూ.30 వేలు విడుదల చేస్తోంది. ఈ క్రమంలో కొత్తగూడెంలోని కూలీలైన్ ప్రభుత్వ పాఠశాలకు రూ.30 వేలు విడుదల చేసింది. దీంతో ఓ శిక్షకుడి చేత విద్యార్థులకు కరాటే శిక్షణ ఇప్పిస్తున్నారు. శిక్షణ ఏప్రిల్‌తో ముగియనుంది. ఈ క్రమంలో కరాటే నేర్పించిన శిక్షకుడికి ఇప్పటికే రూ.10 వేలు చెల్లించారు. మిగతా రూ.20 వేలు తనకు ఇవ్వాలని పాఠశాల హెచ్‌ఎం తాటి రవీందర్ డిమాండ్ చేశారు. దీంతో శిక్షకుడు ఏసీబీకి సమాచారం అందించగా, వారు వలపన్ని హెచ్‌ఎంకు రూ.20 వేలు డబ్బులు ఇస్తుండగా పట్టుకున్నారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. గత రెండు నెలల కాలంలో విద్యాశాఖలో ముగ్గురు అధికారులు ఏసీబీకి పట్టుబడటం గమనార్హం. కాగా కూలీలైన్ పాఠశాలలో రెండు నెలలుగా గతంలో ఉన్న హెచ్‌ఎం, ప్రస్తుత హెచ్‌ఎం మధ్య వర్గ పోరు జరుగుతోందని, పరస్పరం రాజకీయ ఒత్తిళ్లు తీసుకొస్తున్నారని, విద్యాశాఖాధికారులకు ఫిర్యాదు చేసుకున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

ఇంటి వద్దే లింగ నిర్ధారణ

- వాహనంలో యంత్రంతో తిరుగుతున్న ముగ్గురిపై కేసు

చింతకాని: లింగ నిర్ధారణ పరీక్షల జరగకుండా చూస్తూ, తద్వారా భ్రూణహత్యలకు అడ్డుకట్ట వేయాలని అధికారులు తనిఖీలు చేపడుతుండగా.. ఎవరికీ చిక్కకుండా ఇంటి వద్దే పరీక్షలు చేస్తున్న ముఠాపై కేసు నమోదైంది. వాహనంలో యంత్రంతో సహా వచ్చి లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్న ఖమ్మం బల్లేపల్లి, చింతకాని మండలం కొదుమూరుకు చెందిన ఆర్‌ఎంపీలు చారి, రాచబంటి మనోజ్, అల్లీపురం వాసి కాత్యాయినిపై శుక్రవారం కేసు నమోదు చేసినట్లు చింతకాని ఎస్సై నాగుల్‌మీరా తెలిపారు. గ్రామీణ వైద్యులుగా చెలామణి అవుతున్న చారి, మనోజ్ అల్ట్రా సౌండ్ స్కానింగ్ మిషన్ కొనుగోలు చేసి కాత్యాయినిని సాయంగా తీసుకుని కారులో జిల్లాల్లోని పలు గ్రామాలకు వెళ్తున్నారు. ఈసందర్భంగా అక్కడిక్కడే లింగ నిర్ధారణ పరీక్షలు చేసి రూ.10వేల నుంచి రూ.15 వేల వరకు వసూలు చేస్తున్నట్లు మండల వైద్యాధికారి డాక్టర్ అల్తాఫ్ ఫిర్యాదు చేశారు. దీంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు నిఘా వేసి, చింతకాని మండలం కొదుమూరులో రాచబంటి మనోజ్ ఇంట్లో గర్భిణీలకు లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తుండగా గురువారం రాత్రి గుర్తించారు. వైద్యుల అనుమతి లేకుండా లింగనిర్ధారణ పరీక్షలు చేయడం, గర్భంలో పెరుగుతున్న శిశువు ఆడ, మగా అనేది గుర్తించడం నేరమైనందున ముగ్గురిపై కేసు నమోదు చేసి స్కానింగ్ యంత్రం, కారును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

పెళ్లి అన్నాడు, పాప పుట్టాక కాదన్నాడు...

- యువతిని మోసం చేసిన వ్యక్తిపై కేసు

తిరుమలాయపాలెం: అప్పటికే ఒకరి చేతిలో మోసపోయిన ఆమెను పెళ్లి చేసుకుంటానని నమ్మించిన దగ్గరి బంధువు పాప జన్మించాక ముఖం చాటేయడంతో శుక్రవారం పోలీసులు కేసు నమోదు చేశారు. తిరుమలాయపాలెంకు చెందిన యువతికి నాలుగేళ్ల క్రితం క్రితం వివాహం జరగగా, 16 రోజులకే భర్త మరో మహిళతో వెళ్లిపోయాడు. దీంతో ఆమె తల్లిదండ్రుల వద్దే ఉంటూ జీవనం సాగిస్తోంది. రెండేళ్లుగా ఖమ్మం రూరల్ మండలం ఆరెకోడుకు చెందిన మేనత్త కుమారుడు చిర్రా హరీశ్ వీరి ఇంటికి వచ్చివెళ్లే క్రమాన ఆమె అంటే ఇష్టమని, పెళ్లి చేసుకుంటానని నమ్మబలికి శారీరకంగా దగ్గరయ్యాడు. దీంతో ఆమె గర్భం దాల్చి పాపకు జన్మనిచ్చాక తనతో ఎలాంటి సంబంధం లేదని, పాప తనకు పుట్టలేదంటూ హరీశ్ బుకాయించాడు. ఈక్రమాన ఆమె మూడు నెలల పాపను తీసుకుని హరీశ్ ఇంటికి వెళ్లగా ఆయనతో పాటు తల్లిదండ్రులు, సోదరి ఇంటికి రావొద్దని, వస్తే చంపేస్తామని బెదిరించారు. ఈమేరకు బాధితురాలి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కూచిపూడి జగదీష్ తెలిపారు.

మీ-సేవలో విజిలెన్స్ అధికారుల తనిఖీ



కేంద్రంలో పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

ఖమ్మంరూరల్: రూరల్ మండలం కరుణగిరిలోని మీ సేవ కేంద్రంలో వరంగల్ నుంచి వచ్చిన విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శుక్రవారం తనిఖీ చేశారు. తెలంగాణ స్టేట్ టెక్నికల్ సర్వీసెస్(టీజీఎస్‌టీఎస్) ఉన్నతాధికారుల ఆదేశాలతో తహసీల్దార్ పి.రాంప్రసాద్, ఆర్ఐ క్రాంతి సమక్షాన రికార్డులు పరిశీలించారు. ధ్రువీకరణ పత్రాలు, రిజిస్ట్రేషన్ల కోసం ప్రభుత్వం నిర్ణయించిన ధరలే అమలవుతున్నాయా, లేదా అని ఆరా తీశారు.అలాగే, ప్రభుత్వానికి చెల్లించాల్సిన ఆదాయం, రికార్డుల నిర్వహణ వివరాలు తెలుసుకున్నారు. ఏ సేవలకు ఎంతెంత ఫీజు చెల్లించాలో బోర్డు ఏర్పాటుచేయాలని సూచించారు. అలాగే, వినియోగదారులతో మర్యాదగా వ్యవహరిస్తూ ప్రభుత్వ నిబంధనలను పాటించాలని తెలిపారు.

రుణం చెల్లించాలంటూ రైతుకు వేధింపులు

- ష్యూరిటీ ఇచ్చిన వారిపై చర్యలు తీసుకుంటామని బెదిరింపు

రఘునాథపాలెం: ఖమ్మం పాత బస్టాండ్ సమీపంలోని ఓ బ్యాంక్ అధికారులు రుణం చెల్లించాలంటూ వేధిస్తున్నారని రఘునాథపాలెం మండలంలోని బూడిదంపాడుకు చెందిన ఓ రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. అంతేకాక లోన్ కట్టకపోతే మొండి బకాయి కింద చేర్చడంతో పాటు ఎక్కడ రుణం రాకుండా చేస్తామని ఇంటికి వచ్చి కుటుంబ సభ్యులను దుర్భాషలాడుతున్నారని వాపోయాడు. నాలుగేళ్ల క్రితం ఆరున్నర ఎకరాల వ్యవసాయ భూమిని తనఖా పెట్టిన రైతు ట్రాక్టర్ కొనుగోలుకు రూ.10 లక్షల రుణం తీసుకున్నాడు. ఇందులో రూ.5 లక్షల మేర చెల్లించగా, మిగతా అప్పు చెల్లించాలని పది రోజులుగా అధికారులు ఇంటికి వచ్చి ఒత్తిడి చేస్తున్నారని తెలిపాడు. పక్షవాతంతో బాధపడుతున్న సదరు రైతు శుక్రవారం బ్యాంకుకు వెళ్లి రూ.లక్ష చెల్లిస్తానని, మిగతా సొమ్ము మిర్చి అమ్మాక కడతానని చెప్పినా వినకపోగా సాయంత్రం వరకు బ్యాంకులోనే కూర్చోబెట్టారని వాపోయాడు. అంతేకాక ష్యూరిటీ ఇచ్చిన వారి సిబిల్ స్కోర్ పెరగకుండా చూస్తామని చెబుతూ, గత ఏడాది సమీప బంధువు తాకట్టు పెట్టిన బంగారాన్ని తన అప్పు కింద జమ చేసుకున్నారని తెలిపాడు. ఈమేరకు సదరు రైతు తన ఆవేదనను శుక్రవారం సాయంత్రం మండల కేంద్రంలో వెల్లడించగా, అధికారుల వేధింపులు ఆపకపోతే కుటుంబంతో సహా ఆత్మహత్య చేసుకోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశాడు.